క్లుప్తంగా

చెరువు ఆక్రమణదారులపై చర్యలు చేపట్టండి



ఎంపీడీఓ శ్రీలలితకు ఫిర్యాదు చేస్తున్న రాజు

పెద్దాపురం: వాలుతిమ్మాపురం తమ్మయ్యచెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు బచ్చల రాజు కోరారు. సోమవారం ఆయన ఎంపీడీఓ శ్రీలలితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ సర్వే నంబర్ 118లోని తమ్మయ్య చెరువు గర్భం భూమి ఆక్రమణకు గురైందన్నారు. దీనిపై సంబంధిత ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. ఆక్రమణలు తొలగించకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని రాజు అన్నారు.

30న వేణుగోపాలస్వామి కల్యాణం

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ స్వామివారి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త, సీనియర్ ఎంపీటీసీ సభ్యుడు మలకల నూరిబాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4వ తేదీన రాత్రి కల్యాణం జరుగుతుందన్నారు. 30వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలు, పారాయణ, సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ఒకటిన రామకృష్ణ మఠం వారితో భజన, 2న కూచిపూడి భరతనాట్యం, 3న భజన, 4న ఉదయం స్వామి, అమ్మవార్ల కు పంచామృతాభిషేకం, సాయంత్రం అన్నదానం అనంతరం కల్యాణం జరుగుతుందని చెప్పారు.

ఉద్యాన సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లలిత

పెద్దాపురం: మెట్ట రైతాంగానికి ఉద్యాన సాగుపై మరింత అవగాహన కల్పించాలని పెద్దాపురం ఎంపీడీఓ శ్రీలలిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వీహెచ్ఏలకు ఉద్యాన సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీలలిత మాట్లాడుతూ సాగులో లేని భూముల్లో ఉద్యాన సాగు చేసేలా అన్ని గ్రామాల్లో సాగుపై దృష్టి సారించాలన్నారు. గ్రామ సమన్వయ కమిటీల ద్వారా సాగుపై మరింత అవగాహన పెంచాలన్నారు. ఉద్యాన శాఖాధికారి సుజాత మాట్లాడుతూ మండలంలో సుమారు 350 హెక్టార్లలో ఉద్యాన సాగు చేపట్టడానికి అమలులో ఉన్న పథకాల వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఏఎస్ఓ వరలక్ష్మి, ఏఈఓ రాగ స్రవంతితో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

11న శారదా రామకృష్ణ సేవా సమితి ఆవిర్భావ వేడుకలు



రామకృష్ణ సేవా సమితి సమావేశంలో పాల్గొన్న అధ్యక్షులు, సభ్యులు

సామర్లకోట: పీబీదేవం గ్రామంలో ఉన్న శారదా రామకృష్ణ సేవా సమితి 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 11వ తేదీన ప్రారంభమవుతాయని సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన సమితి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న తెల్లవారు జామున సప్రభాత హారతితో విశేష పూజలు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞాయనంద మహారాజ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సభ ఉంటుందన్నారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేస్తారన్నారు. రాత్రి అన్నదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సహాయ కార్యదర్శులు తోటకూర సాంబశివ రావు, చెవ్వాకుల సత్యనారాయణ, కోశాధికారి తులుగుంట్ల నరసింహారావు, సభ్యులు టీవీవీ సత్యనారాయణ, కమ్మిలి వెంకటేశ్వరరావు, నువ్వుల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచా రామ క్షేత్రంలో కుమారా రామభీమేశ్వరస్వామి వారికి ప్రీతైన సోమవారం, వైశాఖ శుద్ధ అష్టమి కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో ఆలయంలోని స్వామి, అమ్మవార్ల ఉప ఆలయాలోను అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైనులో భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదాలు ఏర్పాటు చేశారు.



పిఠాపురం మండలం జములపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు



పిఠాపురం మండలం జములపల్లిలో మొలకలు వచ్చిన ధాన్యం

కర్షకుడికి కన్నీరే మిగిలింది

- నిండా ముంచేసిన అకాల వర్షం
- తడిసి, మొలకలు వచ్చిన ధాన్యం
- నియోజకవర్గంలో 2వేల మెట్రిక్ టన్నులకు పైగా తడిసిన ధాన్యం
- ఆందోళనలో రైతాంగం



జములపల్లిలో తడిసిన ధాన్యాన్ని వంగా గీతకు చూపిస్తున్న రైతులు

పిఠాపురం: అకాల వర్షం అన్నదాతను నిండా ముంచేసింది. రబీ కోతలు చివరి దశలో ఉండగా వచ్చిన వర్షాలు కర్షకుడికి కన్నీటిని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతును నట్టేముంచాయి. పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 1147 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్టు అధికారులు అంచనా వేయగా 2 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం తడిసినట్టు రైతులు వాపోతున్నారు. కొనుగోళ్లు సక్రమంగా చేపట్టకపోవడం వల్లే ధాన్యం కొనేవారు లేక కళాల్లో ఉండిపోయి వర్షానికి తడిసినట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గత ఖరీఫ్‌లో ఏలేరు వరదల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిని ప్రభుత్వం ఆదుకోక తీవ్ర ఇబ్బంది పడి అప్పులు చేసి పంటలు సాగు చేస్తే చివరకు రబీలో కూడా ఇలా నష్టాలు వచ్చాయని రైతులు వాపోతున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లో ఉన్న ధాన్యం 70 శాతానికి పైగా తడిసిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి ఉంటే తమకు ఈ ఇబ్బందులు ఉండేవి కాదని రైతులు చెబుతున్నారు. తడిసిన ధాన్యం మొలకలు రావడంతో ఇక వాటిని ఏమి చేసుకోవాలంటూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాల్లేక..

ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో రైతులు పండించిన పంటకు కిట్టుబాటు ధర లేక చాలా ఇబ్బందులకు గురయ్యారు. ధాన్యం మద్దతు ధర, ధాన్యం సేకరణ విషయంలో కాలయాపన వల్లే అకాల వర్షం కూడా రైతాంగాన్ని మరింత నష్టపరిచింది. పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 2వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయాయని రైతులు చెబుతున్నారు. ఇంకా మామిడి, అరటి పంట రైతులు ఇతర రైతుల కూడా కష్టాల్లో ఉన్నారు. విరవాడలో పెద్ద పెండలం రైతులు పండించిన పంటకు మార్కెట్ అమ్మకం రేటులో ఇబ్బందులు వల్ల చాలా నష్టపోయి బాధల్లో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, రైతులు, కౌలు రైతులను తక్షణం రైతులను ఆదుకోవాలని కోరుతున్నాం.

– వంగాగీత, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పిఠాపురం

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

సామర్లకోట: మండలంలో వరి కోతలు రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ.సత్య విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలో గ్రామాల్లో తడిచిన ధాన్యం రాశులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. వరి కుప్పలు, పనలపై 5 శాతం ఉప్పు నీటిని పిచికారీ చేయాలన్నారు. తడిచిన ధాన్యం రాశులపై ఉప్పు, ఊక కలిపి వరసలుగా చల్లుతూ కప్పు కోవాలన్నారు. అప్పుడే ధాన్యం రంగు మారవని తెలిపారు.

పిఠాపురం మండలంలో తడిసిన ధాన్యం 480 టన్నులు

పిఠాపురం: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు 480 టన్నుల ధాన్యం తడిసాయని ప్రాథమికంగా అంచనా వేసినట్టు పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.స్వాతి తెలిపారు. సోమవారం ఆమె పిఠాపురం మండల వ్యవసాయ అధికారి అచ్యుతరావుతో కలిసి మండలంలోని పలు గ్రామాలు సందర్శించి కళ్లాల్లోని తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ధాన్యపు రాశులలో కింద 2–3 అంగుళాల పరిధిలో బాగా తడిచిపోయిన ధాన్యాన్ని, పైనున్న ధాన్యాన్ని వేరువేరుగా ఆరబెట్టు కోవాలని సూచించారు. బాగా తడిచిన ధాన్యం రంగు మారకుండా మొలకెత్తకుండా ఉప్పు కలిపి నీరు వేసి ఆరబెట్టు కోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గినందున ఆరబెట్టుకుంటే పెద్దగా నష్టం వచ్చే అవకాశం లేదన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే పీజీఆర్ఎస్



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ మాధవరావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించినట్టు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు తెలిపారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఆరు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఏఓ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని మాధవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ ఏఈ రవిశంకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిష్కరించకపోతే పరిష్కార వేదిక ఎందుకు..?



పాడా పీడీకి ఫిర్యాదు చేస్తున్న మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకుడు సూర్యనారాయణ

పిఠాపురం: ఇప్పటికి ఐదు సార్లు ఫిర్యాదు చేశాం.. అయినా ఎవరు పట్టించుకోడం లేదు సమస్యలను పరిష్కరించలేనప్పుడు పరిష్కార వేదికలు ఎందుకు అంటూ మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు ఎన్.సూర్యనారాయణ విమర్శించారు. ఆయన మద్యం దుకాణాలు సమయ పాలన లేకుండా ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేస్తుండడంతో వాటిని నిలువరించాలని జీఓలో ఇచ్చిన ప్రకారం సమయాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తాను ఇప్పటికి ఐదు సార్లు పిఠాపురం పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేశానన్నారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఫిర్యాదులు స్వీకరించడం తప్ప చర్యలు తీసుకోనప్పుడు ఈ వేదికలు ఎందుకు ఇంత మంది అధికారులెందుకంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక మద్యం షాపులు విచ్చలవిడిగా పగలు రాత్రి తేడా లేకుండా నిర్వహిస్తున్నారని విమర్శించారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని జీవోలో ఉన్న టైంకి లోబడి మద్యం దుకాణాలు నిర్వహించేలా చూడాలని అన్నారు. ప్రజల తరుపున పోరాటం చేస్తున్న తమలాంటి వారు ఇచ్చే ఫిర్యాదులే పరిష్కరించకపోతే ఇక ప్రజల సమస్యలు ఏమి పరిష్కరిస్తారంటూ ఆయన అధికారుల తీరును దుయ్యబట్టారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపండి

పిఠాపురం: స్థానిక మున్సిపాలిటీకి చెందిన స్థలంలో కొందరు అక్రమంగా గోడ నిర్మిస్తున్నారని దానిని వెంటనే ఆపాలని కోరుతూ పిఠాపురం మున్సిపల్ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సోమరౌతు లలితాదేవి సోమవారం పాడా పీడీకి ఫిర్యాదు చేశారు. పిఠాపురం మున్సిపల్ రెండో వార్డులో ఒక ఆలయానికి సంబంధించిన వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి గోడ నిర్మాణం చేపట్టారని, దానిని ఆపాలంటూ చెప్పినప్పటికీ వారు పట్టించుకోవడంలేదని తెలిపారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

- సివిల్ సప్లయ్ అధికారి వద్ద రైతుల మొర
- ధాన్యం కొనుగోలు ప్రకటనలకే పరిమితమని ఆరోపణ
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ



సివిల్ సప్లయ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు తమ గోడును వినిపిస్తున్న రైతులు

సామర్లకోట: రైతుల ధాన్యం సమస్యలను పరిష్కరించాలని సివిల్ సప్లయ్ మేనేజింగ్ డైరెక్టరు జిలానీ నమూనీ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని అచ్చంపేట రైతు సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాంతో తేమ శాతం పేరుతో రైతులను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వీరంరెడ్డి వసంతరాయుడు, సలాది రమేష్, యాళ్ల కాశీవిశ్వనాథం, ముమ్మిడి శ్రీనివాసు, సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో రైతులు బొండాలు ఎక్కువగా పండించడంతో బొయిలర్ రైసు మిల్లులు తక్కువగా ఉండడం, ఉన్న మిల్లులు దూరంగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. బొయిలర్ రైసు మిలులు బ్యాంకు గ్యారంటీ మిల్లు టార్గెట్‌కి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదన్నారు. దీనికి తోడు గోనె సంచులు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండడం లేదని, ఏదో రకంగా ధాన్యం మిల్లుకు తరలిస్తే ఆన్‌లోడ్‌లో జాప్యం జరుగుతుందని రైతులు వాపోయారు. ఆన్‌లైన్ నమోదు సకాలంలో చేయకపోవడంతో రైతులకు సొమ్ములు జాప్యం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిలానీ నమూన్ మాట్లాడుతూ రైతుల సమస్యలను వెంటనే పరిష్కారిస్తామని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని హితవు చేశారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యం అమ్ముకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పేరిట కుంభకోణం



ఆవాల లక్ష్మీనారాయణ

సామర్లకోట: కూటమి ప్రభుత్వం మహిళలకు కుట్టు మెషీన్లు, శిక్షణ పేరిట రూ.230 కోట్లు కుంభకోణానికి తెరతీసిందని అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ నిధులతో కుట్టు శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా మహిళా కుట్టు శిక్షణలు ప్రారంభించారని ఆయన తెలిపారు. వెనుకబడిన సామాజిక వర్గాల నిధులను లూటీ చేయడానికి కుట్టు మెషీన్ల శిక్షణ నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రతి ఒక్కరికీ కుట్టు మిషన్‌కు రూ.4,300, శిక్షణకు రూ.మూడు వేలు చెల్లిస్తున్నారని ఆవాల పేర్కొన్నారు. లక్ష మంది లబ్ధిదారులకు రూ.73 కోట్లు ఖర్చు అవుతుందని, అయితే టెండర్లు రూ.230 కోట్లకు ఎలా ఆహ్వానించారని ఆయన ప్రశ్నించారు. కేవలం కుట్టుమెషీన్లు, శిక్షణ పేరిట రూ.167 కోట్లు ప్రజాధనాన్ని కూటమి నాయకులు స్వాహా చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి కుంభ కోణాలకు పాల్పడుతూ బీసీలను ఉద్ధరిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు కూటమి నేతలు అదర కొట్టడం హాస్యాస్పదమన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా అమరావతి రాజధాని పేరిట సరికొత్త డ్రామాలు ఆడడం, డైవర్షన్ పాలిటిక్స్‌కు నిదర్శనమన్నారు.

తడిసిన ధాన్యంతో రైతులకు అదనపు భారం



వీకే రాయపురంలోని పొలం నుంచి సురక్షిత ప్రదేశానికి తడిసిన ధాన్యం తరలిస్తున్న రైతులు



వీకే రాయపురం రోడ్డుపై ధాన్యం ఆరబెడుతున్న రైతు

సామర్లకోట: తడిసిన ధాన్యం కొనుగోలు మాట ఏలా ఉన్నా ఆ ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి అదనపు భారమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కురిసిన వర్షం కారణంగా పొలాల్లో నీరు చేరడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిచి ముద్దయిన విషయం విధితమే. తడిసిన ధాన్యం కళ్లాల్లో ఆరబెట్టుకువడానికి అవకాశం లేకపోవడంతో రైతులు సురక్షిత ప్రదేశాలకు తరలించుకొని ఆరబెట్టుకొంటున్నారు. దాంతో పొలం నుంచి బయటకు తీసుకు రావడానికి ఎకరానికి రూ.ఐదు వేల నుంచి రూ.ఆరు వేల వరకు అదనపు పెట్టుబడి అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరబెట్టి ధాన్యాన్నే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే పరిస్థితి కని పించడం లేదని, ఇప్పుడు ఈ ధాన్యాన్ని ఏలా కొంటారోనని ఆందోళన చెందుతున్నారు. గిట్టుబాటు ధర రూ.1725 ఉండగా రూ.1600 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. బయట వ్యక్తులకు విక్రయిస్తే రూ.1550 విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం ముక్కు పాయాయనే సాకుతో కొనుగోలు చేసే అవకాశం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



పిఠాపురం మండలంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వంగా గీత తదితరులు

పిఠాపురం: పండించిన ధాన్యం అమ్ముకునే అవకాశం లేక, వాటిని కొనే నాథుడు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత డిమాండ్ చేశబూరు. ఆమె సోమవారం పిఠాపురం నియోజకవర్గంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం నష్టాలపాలైన రైతులను కలిసి వారి బాధలను విన్నారు. వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడిన ఆమె తడిసిన ధాన్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని వెంటనే తగిన విధంగా ఆదుకోవాలని కోరారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నష్ట పోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. నియోజకవర్గంలో రైతులు గత ఖరీఫ్‌లో ఏలేరు వరదల వల్ల నష్టాల పాలవ్వగా ప్రస్తుతం రబీలో ధాన్యం కొనుగోళ్ల సక్రమంగా లేక రైతులు నష్టాల పాలయ్యారన్నారు. అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై ఇప్పటికైనా దృష్టి పెట్టి ఏ ఒక్క రైతు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల తరుపున వైఎస్సార్ సీపీ నాయకులు తామంతా అండగా ఉంటామన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఏఒక్క రైతు ఇబ్బంది పడకుండా అన్ని రకాల ధాన్యానికి మద్దతు ధర చెల్లించి సకాలంలో కొనుగోళ్ల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వరినీడి సుజాత, వైఎస్సార్ సీపీ పిఠాపురం పట్టణ, మండల అధ్యక్షుడు రావుల మాధవరావు, అడపా రఘు, కొత్తెం దత్తుడు తదితరులున్నారు.

సోలార్ కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవాలి

సీఆర్పీల శిక్షణలో కమిషనర్ శ్రీవిద్య



సామర్లకోట మెప్మా సిబ్బంది సమావేశంలో మాట్లాడిన కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: పట్టణంలో సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్ల ప్రతి ఒక్కరూ వినియోగించుకొనే విధంగా మెప్మా ఆర్పీలు, మహిళా సమాఖ్య సభ్యుల కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళా సమాఖ్యలో ఉన్న ప్రతి సభ్యురాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని సబ్సిడీ పొందాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్స్ వరకూ ఉచితంగా అందజేస్తామన్నారు. శ్లాబ్‌తో ఉన్న ఇళ్లతోపాటు పెంకులు, రేకులతో ఉన్న ఇళ్లకు సోలార్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అదే విధంగా పాక ఉన్న వారికి ఇంటి వద్ద ఖాళీ స్థలం ఉంటే ఆ స్థలంలో సోలార్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులు ఆయా వార్డుల ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఉండడంలో సోలార్‌పై ప్రజలకు అవగాహన ఏర్పడుతుందన్నారు. సోలార్ ఏర్పాటు చేసుకున్న సమయంలో వాడకం చేయగా మిగిలిన విద్యుత్‌ను ట్రాన్స్కు సంస్థ కొనుగోలు చేస్తుందని చెప్పారు. ట్రాన్స్కో ఏఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయించుకోవడంతో దాదాయం పొందే మార్గం కూడా ఉంటుందని చెప్పారు. యూనిట్‌లో 50 శాతం సబ్సిడీగా, ఒక కిలో వాట్‌కు ప్రభుత్వం రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3కిలో వాట్లకు ఆ పైన రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు అవసరమైన మొత్తం బ్యాంకులు అందజేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి మెప్మా సీఎంఎం హుస్సేన్ అధ్యక్షత వహించగా మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పిఠాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఒక మహిళ మృతి చెందినట్టు సోమవారం పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఆర్లంక రామలక్ష్మి ఆమె తోటి కోడలు సత్యవతి, అప్పలనర్స, లక్ష్మి అనే మహిళలతో కలిసి ఒక ఆటోలో కొత్తపల్లి మండలం గోర్స గ్రామానికి పుట్టినరోజు ఫంక్షన్ నిమిత్తం ఆదివారం వెళ్లారు. మార్గమధ్యలో గొల్లప్రోలు మండలం తాటిపర్తి జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి వారి వెనక వస్తున్న గుర్తు తెలియని వాహనం ఆటోని బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు డౌన్‌లో పడిపోగా దానిలో ఉన్నపై నలుగురికి గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్య నిమిత్తం కాకినాడ జనరల్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిలో తీవ్ర గాయాలైన ఆర్లంక రామలక్ష్మి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.